సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ၊ 30 ၊ జనవరి ၊ 2023



ఆక్వా రైతుకు చేయూత

జిల్లాలోని ఆక్వా రైతులను అభివృద్ధి చేసేందుకు ఆక్వా సాగుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతను అందిస్తోంది. సాగు ప్రారంభం నుంచి ఉత్పత్తుల విక్రయం, ఎగుమతుల వరకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,270
3 శాతం జీఎస్టీతో	రూ.5,428
నవర (8 గ్రా)	రూ.43,424

గరిష్టం/కనిష్టం
29.9 /21.8

వాతావరణం

వాయుగుండం ప్రభావంగా జిల్లా వ్యాప్తంగా సోమవరం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మోస్తరు జల్లుల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ 68 శాతం ఉంది.

న్యూస్‌రీల్

తూనికలు, కొలతల శాఖాధికారుల దాడులు



చేపల అమ్మకదారుల వద్ద తూకాలను పరిశీలిస్తున్న తూనికల కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ సాయిశ్రీకర్

నెల్లూరు(అర్బన్): చేపలు, రొయ్యల అమ్మకాల్లో మోసాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆదివారం తూనికలు, కొలతల శాఖాధికారులు పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. కృష్ణపట్నంరోడ్డులోని పలు దుకాణాలతో పాటు మినీబైపాస్‌రోడ్డులోని చేపల విక్రయ దుకాణాల వద్ద ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ సాయిశ్రీకర్ మాట్లాడుతూ తక్కువగా తూస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేశామని వివరించారు. వ్యాపారస్తులు తూకాలలో మోసాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. కేసులతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు. తూకాల్లో మోసాలు చేస్తుంటే వినియోగదారులు తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్న చేదోడు

- జిల్లాలో 18,522 మంది లబ్ధిదారులు
- ఖాతాల్లో మూడో విడత నగదు జమ

నెల్లూరు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జగనన్న చేదోడు మూడో విడత కింద లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు జమ చేయనున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ఇందుకు సంబంధించి నెల్లూరు జిల్లాలో షాపులున్న రజకులు, నాయిబ్రాహ్మణులు, అన్ని కులాల టైలర్స్‌కు ఈ నగదు జమ చేస్తారు. మూడో విడత కింద జిల్లాలో మొత్తం 18,522 మందికి రూ.18.522 కోట్లు నగదు జమ చేస్తారు. ఈ సందర్భంగా వినుకొండ నుంచి సీఎం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ చక్రధర్‌బాబుతో పాటు ఇతర అధికారులు, లబ్ధిదారులు హాజరు కానున్నారు.

కృష్ణపట్నంలో కోస్టుగార్డు డైరెక్టర్ జనరల్ పరిశీలన



కోస్టుగార్డు నౌకలను పరిశీలిస్తున్న డైరెక్టర్ జనరల్ వీరేందర్ సింగ్ పథానియా

ముత్తుకూరు: ఇండియన్ కోస్టుగార్డు డైరెక్టర్ జనరల్ వీరేందర్‌సింగ్ పథానియా ఆదివారం కృష్ణపట్నం ఇండియన్ కోస్టుగార్డు స్టేషన్‌ను పరిశీలించారు. ప్రత్యేక నౌకలో తన వీడ్కోలు సందర్శనలో భాగంగా వచ్చిన డైరెక్టర్ జనరల్‌కు కమాండింగ్ ఆఫీసర్ అబీక్ చక్రవర్తి ఘనంగా స్వాగతం పలికారు. కోస్టుగార్డులను పరిచయం చేసుకున్నారు. వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అధికారులతో కొద్దిసేపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారనే అంశంపై ఆరా తీశారు. రిమోట్ స్టేషన్‌ను తనిఖీ చేసి, దీని కార్యకలాపాలను పరిశీలించారు. అధికారులు వెంటరాగా కృష్ణపట్నంపోర్టులో పర్యటించారు. పోర్టులో ఉన్న ఇండియన్ కోస్టుగార్డు నౌకలను తనిఖీ చేశారు. వాటి పనితీరు, సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అధికారులకు అవసరమైన సూచనలు అందజేశారు.

భారీగా బొగ్గు దిగుమతి

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా భారీస్థాయిలో బొగ్గు దిగుమతి జరుగుతున్నట్లు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ఈస్ట్ ట్రేడర్ అనే నౌక ద్వారా 1.61 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతోందని వెల్లడించారు. చోళ ప్రాస్‌పెరైటీ అనే నౌక 73,714 టన్నుల బొగ్గు దిగుమతి చేయడం పూర్తవుతోందని చెప్పారు. మరో వైపు స్పెరా అనే నౌక ద్వారా ఫిబ్రవరిలో 66 వేల టన్నుల డీఏపీ దిగుమతి జరిగే అవకాశం ఉందని తెలిపారు.

సోమశిలలో 69.515 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం నాటికి 69.515 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 1454 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 650, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.419 మీటర్ల నీటి మట్టం ఉంది.

రక్కరి.. తక్కెడ

నగరంలోని జీవీనగర్‌కు చెందిన వెంగయ్యయాదవ్ రెండు రోజుల క్రితం వనంతోపు సెంటర్ వద్ద మినీబైపాస్ పక్కనే ఉన్న చేపల దుకాణంలో నాలుగు కేజీలు బరువైన చేపను కొనుగోలు చేశాడు. వాటిని కట్ చేయించి మళ్లీ తూకం వేయిస్తే 3.200 కేజీలు తూగింది. చికెన్ షాపులోని కాటాలో ఈ చేపలను తూకం వేస్తే 2.950 కేజీలు మాత్రమే వచ్చింది. అంటే 250 గ్రాముల వరకు తూకంలో మోసం చేసినట్లుగా నిర్ధారణ అయింది. అంటే కేజీకి పావు కిలో మోసం చేస్తున్నారు. ఈ లెక్కన చూస్తే కేజీ చేప (లైవ్ ఫిష్) రూ.160 వరకు ధర ఉంది. కేజీకి దాదాపు రూ.40 వరకు అదనంగా దోపిడీ చేస్తున్నారు.



నెల్లూరు మినీ బైపాస్‌రోడ్డులోని చేపల దుకాణాలు



జిల్లాలోని దుకాణాల్లో తుకాల్లో మోసాలతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొనే ప్రతి వస్తువులోనూ తక్కరి తుకాలతో వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారు. పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం దుకాణాల్లో దోపిడీకి అడ్డూఅదుపు లేదు. బడ్డీ కొట్టు నుంచి సూపర్ మార్కెట్ వరకు అక్కడా.. ఇక్కడా అనే తేడా లేకుండా తూకాల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రధానంగా ప్యాకింగ్ వస్తువుల్లోనూ ఇదే మోసాలు జరుగుతున్నాయి.

- తూకాల్లో దుకాణాల నిలువు దోపిడీ
- నిండా మునుగుతున్న వినియోగదారులు
- సాధారణ కాటా, ఎలక్ట్రానిక్ మెషిన్లలోనూ చేతివాటం
- చేపలు, మాంసం దుకాణాల్లో పక్కా మోసం
- బడ్డీ కొట్టు నుంచి సూపర్ మార్కెట్ వరకు అదే దందా
- ఏడాదిలో 347 కేసులు నమోదు
- తనిఖీలు చేస్తున్నా.. ఆగని అక్రమాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు సిటీలో చిన్న కిరాణా షాపు నుంచి సూపర్ మార్కెట్ల వరకు తూకంలో చేతివాటం ప్రదర్శిస్తుండడంతో వినియోగదారులు మోసపోతున్నారు. బియ్యం, ఉప్పు, పప్పు, కూరగాయలు, మాంసం.. ఇలా ఏది కొనుగోలు చేసినా కిలోకు 900 గ్రాములే వస్తోంది. ఇక లీటర్లలో కొనుగోలు చేసే పాలు, పెరుగు, నెయ్యి, పెట్రోల్, డీజిల్ తదితరాల్లో లీటర్‌కు 800-850 మిల్లీ.లీటర్లే వస్తున్నాయి. సాధారణ కాటాతో పాటు ఎలక్ట్రానిక్ మెషిన్లలో సెట్టింగ్‌లు చేస్తూ వ్యాపారులు ఈ మోసాలకు పాల్పడుతున్నారు. చట్టాల్లోని లొసుగులే ఆసరాగా దోపిడీ చేస్తూ తప్పించుకుంటున్నారు.

'ఆప్షన్స్'తో గోల్‌మాల్

ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్‌లో మొత్తం నాలుగు ఆప్షన్లు ఉంటాయి. ఇందులో ఒకదాని సహాయంతో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. కిలోకు 100-150 గ్రాముల తక్కువగా ఉండేలా సెట్ చేస్తున్నారు. అప్పుడు ఆ ఆప్షన్ నొక్కి మెషిన్‌పై 850-900 గ్రాములు బరువు ఉంచితే అది 1000 గ్రాములు (కిలో)గా డిస్‌ప్లే చూపిస్తుంది. అదే మెషిన్‌పై కిలో బరువు ఉంచితే 1100-1150 గ్రాములు చూపుతోంది. అంటే కిలోకు 100-150 గ్రాముల వరకు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మెషిన్‌లోని మరో ఆప్షన్‌ను నొక్కితే తూకం వచ్చినప్పుడు సరైన ఆప్షన్‌తో తూకం వేస్తూ వ్యాపారులు బోల్తా కొట్టిస్తున్నారు. ఇలాంటి ఘటనలు బయటపడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ప్యాకింగ్‌లో సైతం..

మార్కెట్‌లో లభించే వివిధ బ్రాండ్ల నూనె ప్యాకెట్లు కూడా నిర్దేశించిన బరువు కంటే తక్కువగా ఉంటున్నాయి. లీటర్ ప్యాకేజ్డ్ నూనె నిబంధన ప్రకారం ప్యాకెట్‌లో 910 మిల్లీ లీటర్లు ఉండాలి. కానీ 800-850 గ్రాములు మించడం లేదు. ఇక ఐదు లీటర్ల ప్యాకేజ్డ్ బాటిల్‌లో 200-280 గ్రాములు, 15 లీటర్ల ప్యాకేజ్డ్ బాటిల్‌లో 250-300 మిల్లీ లీటర్లు తక్కువగా ఉంటోంది. తక్కువ తూకం ఉన్న ప్యాకింగ్‌లు సైతం తూనికలు, కొలత శాఖ అధికారుల దాడుల్లో బయట పడడమే ఇందుకు నిదర్శనం.

పసిడి (బంగారం)లోనూ..

నగరంలోని పెద్ద పెద్ద దుకాణాల్లో మినహా మిగతా వాటిలో సాధారణంగా 24 క్యారెట్ల కంటే తక్కువ నాణ్యత కలిగిన బంగారాన్నే విక్రయిస్తుంటారు. వజ్రాల నగ కేవలం 18 క్యారెట్ల బంగారంతో మాత్రమే ఉంటుంది. వ్యాపారులు 18 క్యారెట్ల ఆభరణాన్ని వినియోగదారులకు విక్రయించి 22 క్యారెట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు. 22 క్యారెట్లు, 18 క్యారెట్ల ఆభరణానికి మధ్య గ్రాముకు కనీసం రూ.500 నుంచి రూ.700 వరకు తేడా ఉంటుంది. ఈ లెక్కన కనీసం 10 గ్రాములకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు నష్టం తప్పదు. బంగారం తూచే ఎలక్ట్రానిక్ కాటాల వెను త్రాసును నియంత్రించే వీల్స్ బేరింగ్‌లను మార్పు చేసే అవకాశం ఉంటుంది. బంగారం నాణ్యతను తెలిపే మెషిన్ లేకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు. నగరంలో పెద్ద, చిన్న చిలకా వ్యాపార సంస్థలన్ని కలిపి సుమారు 1.50 లక్షలకు పైగా ఉంటాయి. వీటిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి మోసాలను అరికట్టాల్సిన బాధ్యత తూనికలు, కొలతలశాఖ అధికారులపై ఉంది. అయితే కొనుగోలుదారులు ఫిర్యాదులు చేస్తే తనిఖీలు చేస్తున్నారు. తూకాల్లో మోసం, నిబంధనల ఉల్లంఘనలపై మొదటి సారి జరిమానా విధిస్తారు. అదే తప్పు తిరిగి చేస్తే కేసు నమోదు చేసి కోర్టుకు సిఫార్సు చేస్తారు. కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే కోర్టు జైలు శిక్ష విధించిన కేసులు పెద్దగా లేనట్లు తెలుస్తోంది. తక్కువ తూకం వేస్తే తూనికలు, కొలతలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2009 యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం కనీసం రూ.1000 నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారు. ప్యాకేజీ కమోడిటీ యాక్ట్ 30 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారికి రూ.2 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా వేస్తారు.

గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ 31 వరకు గణాంకాలు

స్టాంపింగ్ ఫీజు	రూ.77,99,347
కాంపౌండింగ్ ఫీజు	రూ.31,16,500
తూకంలో మోసం చేస్తున్న కేసుల నమోదు	347
ప్యాకేజ్డ్ కమోడిటీస్ కేసులు	182
మొత్తం కేసులు	529

పావు, అర కేజీల దగ్గర మోసం చేయడానికి కుదరదు. అంతకు మించి కొనుగోలు చేసేటప్పుడే వంద గ్రాముల వరకు తూకంలో తేడా చేయొచ్చు. సరుకును కాటాలో వేసేటప్పుడు వేగంగా వేస్తే బరువు వేగంగా తూగుతుంది. వెంటనే తీసి వినియోగదారులకు ఇచ్చేస్తారు. అలాంటప్పుడు వంద గ్రాముల కలిసొస్తుంది. ఏ వస్తువు కొన్నా కాటాలో వేగంగా పడేయడం వల్ల ఇలా జరుగుతుంది.

– ఒక చిరు వ్యాపారి

మాంసం, చేపలు నీటిలో ఎక్కువగా ఉంచడం వల్ల నీరు పడుతుంది. ఆ సమయంలో కొనుగోలుదారుడికి తూకంలో తేడా వస్తుంది. ఉదాహరణకు రెండు కిలోల మాంసం తీసుకుంటే అందులో కనీసం పావు కిలో వరకు తగ్గుతుంది.

– ఒక చేపల దుకాణం వ్యాపారి

ఎలక్ట్రానిక్ కాటా అయితే సున్నా ఉందో చూసుకోవాలి. కాటా మీద ఇంకేమైనా బరువైనవి ఉంచారేమోనని చూడాలి. త్రాసు కాటా విషయానికి కొస్తే బరువు తూచేటప్పుడు ముళ్ల దగ్గర కొంత మంది వేలు అడ్డు పెట్టి తూగకుండా ఆపుతారు. ఆ సమయంలో నిశితంగా పరిశీలించాలి.

– కిరాణ వ్యాపారి

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

తూకంలో మోసాలు జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. కూరగాయలు, చికెన్, చేపల మార్కెట్లలో ధర్మకాటాలు కూడా ప్రవేశ పెట్టాం. తూకంలో తేడాలు కన్పిస్తే చాలు ధర్మకాటా ద్వారా తూకం వేసుకొని సరిచూసుకొవచ్చు. తక్కువ తూకం వస్తే తమ దృష్టికి తెస్తే తప్పకుండా ఆ దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం. వనంతోపు సెంటర్‌లో కూడా తూకంలో మోసాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రావడంతో తనిఖీలు చేసి కాటాలను సీజ్ చేశాం.

– థామస్ రవికుమార్, డిప్యూటీ కంట్రోలర్ నెల్లూరు

గ్రావెల్ దొంగలు టీడీపీ నేతలే

- గత ప్రభుత్వ హయాంలో ఇష్టారీతిన గ్రావెల్ రవాణా
- ప్రధాన సూత్రధారులు బీద, మాలేపాటిలే
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా టీడీపీ నేతలే అని, గత టీడీపీ ప్రభుత్వంలో బీద రవిచంద్ర, మాలేపాటి సుబ్బానాయుడు ప్రకృతి వనరులను దోచుకున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి నుంచి నెల్లూరు వరకు ఉన్న రైల్వే ట్రాక్‌కు అనుబంధంగా మూడో రైల్వేలైన్ నిర్మాణం సుమారు 50 కిలోమీటర్ల పొడవున నేలలను లెవలింగ్ చేయాల్సి వచ్చిందన్నారు. ఇందుకు కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అవసరం కావడంతో ప్రస్తుతం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బీద రవిచంద్ర, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడు రంగంలోకి దిగారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అప్పట్లో టీడీపీ అధికారంలో ఉండడంతో అధికారులు కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండగా, బీద, మాలేపాటి కలిసి నియోజకవర్గంలోని చెరువులు, కాలువలు, గుంతలు, ప్రభుత్వ భూములు, అటవీ శాఖ భూములు, ఇలా ప్రకృతి సంపదనంతా కొల్లగొట్టి రైల్వేట్రాక్ నిర్మించే వారికి అమ్ముకున్నారన్నారు. గతంలో వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసీబీలతో గ్రావెల్‌ను దోచుకున్నా.. ఏ ఒక్కరూ ప్రశ్నించలేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ తరుపున పలు రకాల ఆందోళనలు చేసినప్పటికీ ఏ ఒక్కరూ మద్దతు కూడా ఇవ్వలేదని చెప్పారు.

పేదల ఇళ్ల, అభివృద్ధి పనుల కోసం..

నేడు ఇళ్ల కోసమో, రోడ్ల కోసమో, జగనన్న కాలనీల కోసమో గ్రావెల్ తరలిస్తుంటే అధికారులను, తమ పార్టీ నాయకులను కొందరు ఇష్ట ప్రకారం మాట్లాడడం దుర్మార్గమని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఆఖరికి ప్రైవేటు భూములను సాగు చేసుకునేందుకు అనువుగా సిద్ధం చేసుకునే క్రమంలో అడ్డుగా ఉన్న గ్రావెల్‌ను రైతులు తొలగించుకుంటున్నా అక్రమం, దోపిడీ, వాటాలు అంటూ టీడీపీ మీడియాల్లో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆవేదన చెందారు. అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి పబ్బం గడుపుకునే టీడీపీ నేతలు సాక్షాత్తూ ఆర్డీఓ, డీఎస్పీ స్థాయి అధికారులను కూడా కులం పేరుతో దూషిస్తున్నప్పటికీ ఎవరూ తప్పని చెప్పడం లేదన్నారు. అయినప్పటికీ టీడీపీ నేతల బెదిరింపులకు అధికారులు బెదిరిపోమని అన్నారు. కావలి మున్సిపాలిటీలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ట్యాంకర్లతో ప్రజలకు తాగునీరు సరఫరా పేరుతో నిధులు లూటీ చేసేవారని, కానీ తాము దానిని నివారించి నెలకు రూ.60 లక్షలు మిగుల్చుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, పందిటి కామరాజు, కుందుర్తి కామయ్య, అమరా వేదగిరి, కనపర్తి రాజశేఖర్, గంధం ప్రసన్నాంజనేయులు, గుర్రం వెంకటేశ్వర్లు, పుల్లా శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఎంపికలు



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలను ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముక్కాల మాట్లాడుతూ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ గణనీయమైన అభివృద్ధిని సాధించిందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ముగ్గురు జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని వివరించారు. ఈ పోటీలు, ఎంపికల్లో 35- 75 ఏళ్ల వయోపరిమితిలోని క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి 51 జట్లు ఈ టోర్నీలో తలపడుతున్నాయిని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి పొద్దుటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచ్ శంకరనారాయణ, పత్తేటి వెంకటనారాయణరావు, చంద్రారెడ్డి, డాక్టర్ యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కర్నూలు జిల్లా నందికొట్కూరులో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ జూడో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర అసోసియేషన్ నెల్లూరు కేంద్రం కావడంతో ఈ పోటీల నిర్వహణ కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి చెన్నైలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ కార్యదర్శి బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఉమెన్ కన్వెన్షన్‌కు ఎన్‌జీఓ మహిళా నేతలు



జైపూర్ మహిళా కన్వెన్షన్‌కు హాజరైన నెల్లూరు ఏపీఎన్‌జీఓ మహిళా విభాగం నాయకులు స్వర్ణలత, కరుణమ్మ, చిన్నమ్మ తదితరులు

నెల్లూరు (అర్బన్): ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజులు జైపూర్–దుర్గాపూర్‌లో జరుగుతున్న నేషనల్ ఉమెన్ కన్వెన్షన్‌కు నెల్లూరు జిల్లా ఏపీ ఎన్‌జీఓ సంఘం మహిళా నేతలు హాజరయ్యారు. రాష్ట్ర మహిళా విభాగం వైస్ చైర్‌పర్సన్ స్వర్ణలత, ఉపాధ్యక్షురాలు కరుణమ్మ, జిల్లా మహిళా విభాగం చైర్ పర్సన్ చిన్నమ్మ అక్కడ జరిగే ఉమన్ కన్వెన్షన్‌కు వెళ్లారు. అక్కడ మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సహకారం, ప్రభుత్వాల నుంచి మహిళా ఉద్యోగులకు రావాల్సిన రాయితీలు, మహిళా సంఘాల బలోపేతం గురించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడువెంకటస్వామి ఆదివారం నెల్లూరులో మాట్లాడుతూ జిల్లా తరపున మహిళలు పాల్గొని మాట్లాడం తమ అసోసియేషన్‌కు, మహిళా ఉద్యోగులకు గర్వకారణమన్నారు.

రెడ్‌క్రాస్ ప్రత్యేకాధికారిగా డీఆర్వో

నెల్లూరు (అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రత్యేకాధికారిగా డీఆర్వో వెంకటనారాయణమ్మను కలెక్టర్ నియమించారు. రెడ్‌క్రాస్ పాలక వర్గం ఫిబ్రవరి 2వ తేదీతో ముగియనుంది. నూతన కమిటీని ఎన్నుకునేందుకు కనీసం నెల ముందుగానే సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. అయితే పలు కారణాలతో సమావేశం జరగలేదు. ఈలోగా గడువు ముగియనుండడంతో ఎన్నికలు కొంత కాలం జరిగే పరిస్థితి లేదు. ప్రస్తుత కమిటీ సభ్యుల పదవీ కాలం ముగియ నుండడంతో అక్కడి కార్యకలాపాలు పర్యవేక్షించేందుకు, మళ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఇబ్బంది లేకుండా డీఆర్వోని నియమించారు.

క్లుప్తంగా

ప్రాణం కాపాడిన యువకులు



కాపాడిన యువకులు కుమార్, తరుణ్



చికిత్స పొందుతున్న అమరేంద్ర

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో ఓ వ్యక్తి ప్రాణాన్ని యువకులు కాపాడారు. స్థానికుల కథనం మేరకు.. కావలికి చెందిన అమరేంద్ర అనే యువకుడు ఆదివారం సముద్రంలో దిగి అలల వల్ల కొట్టుకుపోయాడు. తీరంలో ఉన్న యువకులు కుమార్, తరుణ్ వెంటనే స్పందించి అమరేంద్రను కాపాడి ఒడ్డుకు చేర్చారు. 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఈఎంటీ అంకయ్య, పైలట్ డి.సుబ్రహ్మణ్యం అమరేంద్రకు ప్రాథమిక చికిత్స అందించి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాణం కాపాడిన యువకులను వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు: మోటార్‌బైక్‌పై నెల్లూరు నుంచి వస్తున్న దంపతులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరూ గాయపడిన ఘటన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై ఎం.శివశంకర్రావు కథనం మేరకు.. అనంతసాగరం మండలం వెంగంపల్లికి చెందిన ఊటుకూరు వెంకటేశ్వర్లు, శిరీష దంపతులు నెల్లూరు నుంచి మోటార్‌బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈక్రమంలో బైపాస్ రోడ్డు సమీపంలో నెల్లూరు వైపు వెళ్తున్న కారు వారి బైక్‌ను ఢీకొంది. దీంతో దంపతులు గాయపడ్డారు. సమీపంలోని స్థానికులు వారిని చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.12
పండ్లు : రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్):	116
లేయర్ (లైవ్):	85
బ్రాయిలర్ చికెన్:	204
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	228
లేయర్ చికెన్:	145



ఆక్వా రైతుకు చేయూత

- జోన్ పరిధిలోని వారికి విద్యుత్ రాయితీ
- నాన్ ఆక్వాజోన్‌లోనూ ఇచ్చేందుకు సర్వే
- ఇప్పటికే మొదలైన గ్రామసభలు



గ్రామసభ నిర్వహిస్తున్న మత్స్యశాఖ అధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా ఉంది. వారికి ఇప్పటికే అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోంది. ఎగుమతులకు సంబంధించి సెస్ విషయంలో, అదేవిధంగా సీడ్ విక్రయాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంది. ప్రధానంగా రొయ్యల సాగు చేస్తున్న వారికి విద్యుత్ సబ్సిడీ వర్తింజేస్తోంది. నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉన్న రైతులకు త్వరలో శుభవార్త చెప్పే అవకాశముంది.

సర్వే చేసి..

జిల్లాలో ఈ–ఫిష్ ఆన్‌లైన్ సర్వే చేయగా అందులో 31,387 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నట్లు గుర్తించారు. వాటిలో ఇప్పటికే 13,750 ఎకరాలు ఆక్వాజోన్‌లో ఉండగా, 17,637 ఎకరాలు నాన్ ఆక్వాజోన్‌లో ఉన్నాయి.

ఇప్పటికే..

జిల్లాలోని ఆక్వా సాగు ఇతర ప్రాంతాల కంటే ప్రసిద్ధి. ఇక్కడి నుంచి ఇతర దేశాలకు రొయ్యలను ఎగుమతి చేస్తుంటారు. అటువంటి ఆక్వా రైతులకు అండగా ఉండాలని సబ్సిడీపై విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోంది. చంద్రబాబు పాలనలో ఆక్వా రైతులు సబ్సిడీ ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్య వెళ్లిన వెంటనే సబ్సిడీ అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఆక్వాజోన్ పరిధిలో ఉన్నవారికి సంబంధించి పది ఎకరాల్లోపుంటే యూనిట్‌కు రూ.1.50, పదిఎకరాల పైన ఉంటే రూ.3.85 రాయితీ ఇస్తోంది.

వారి కోసం..

నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉన్న వారికి కూడా విద్యుత్ రాయితీ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఎక్కువగా ఆక్వా సాగు చేస్తున్న ప్రాంతాల్లో ఇప్పటికే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈనెల 31వ తేదీలోపు సర్వే పూర్తి చేసి, ఫిబ్రవరి 2వ తేదీ లోపు మండలస్థాయిలో సర్వే చేయాలని నిర్ణయించారు. అదే విధంగా 4వ తేదీ లోపు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అప్రూవల్ చేయించి నాన్ ఆక్వాజోన్ కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేలా చేయనున్నారు. కాగా నాన్ ఆక్వాజోన్‌లో సాగుచేసే రైతులు సొంత భూమి కలిగి ఉండాలి. ప్రభుత్వ భూమిలో సాగు చేస్తుంటే సబ్సిడీ వర్తించదని కూడా అధికారులు చెబుతున్నారు. సాగుకు సంబంధించి పూర్తి వివరాలను గ్రామాల్లో ఉండే మత్స్యకార సిబ్బంది వద్ద నమోదు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

త్వరగా పూర్తి చేసేందుకు ప్రణాళిక



నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉండే రైతులకు కూడా విద్యుత్ రాయితీ ఇచ్చేందుకు ఇప్పటికే సర్వే చేస్తున్నాం. గ్రామ సభలు కూడా నిర్వహిస్తున్నాం. మరో వారంలో పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. ఆక్వా రైతులు కూడా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో సిబ్బంది వద్ద వివరాలు నమోదు చేయించుకోవాలి.

– నాగేశ్వరరావు, జేడీ, మత్స్యశాఖ

భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

- కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి
- జాబ్‌మేళాలో 230 మందికి ఉద్యోగాలు



యువతికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు అర్బన్: చిన్న ఉద్యోగమా.. పెద్ద ఉద్యోగమా అనుకోకుండా బాగా పనిచేసి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్‌మేళా జరిగింది. తొలుత మానుగుంట జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 20 కంపెనీలు పాల్గొన్నాయి. ఎంపికైన అభ్యర్థులకు సాయంత్రం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందించిన సంక్షేమ పథకాలతో ఎంతోమంది ఉద్యోగాలు సంపాదించి ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. సీఎం స్ఫూర్తితో ఈ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఏ ఉద్యోగమైనా అంకితభావంతో, క్రమశిక్షణతో చేసినప్పుడు ఉన్నత స్థాయికి చేరుకుని జీవితంలో రాణిస్తారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ ఫెయిర్‌లు నిర్వహిస్తామని చెప్పారు. మొత్తం 464 మంది అభ్యర్థులు పాల్గొనగా 230 మంది ఎంపికైనట్లు తెలిపారు. టీఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి సహకారంతో రూ.కోటి వ్యయంతో కళాశాలలో మౌలిక వసతులను కల్పించామన్నారు. మెగా జాబ్ ఫెయిర్‌ను కళాశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ సీతారామయ్య మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుంచి ఎదిగిన వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం టీఆర్‌ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆక్వాటిక్ పాండ్‌ను ప్రారంభించారు. ఆవరణలోని బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్, ఎంఎంఆర్ టీం సభ్యులు పూసపాటి జగన్, చిట్యాల సురేష్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు ఎస్‌కే రఫీ, గణేశం గంగిరెడ్డి, సర్పంచ్‌లు మాధవరావు, కుమ్మరి బ్రహ్మయ్య, గంగవరపు వెంకట్రావు, నగళ్లనారయ్య, పిడికిటి శంకర్, రహీం తదితరులు పాల్గొన్నారు.



మేళాకు విచ్చేసిన అభ్యర్థులు

నేరాల కట్టడే లక్ష్యంగా..

- నెల్లూరు నగరంలో పోలీసుల తనిఖీలు



ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్



కూల్‌డ్రింక్ షాపు వద్ద మద్యం తాగుతున్న వ్యక్తిని పంపుతున్న పోలీస్

నెల్లూరు(క్రైమ్): నేరాల కట్టడే లక్ష్యంగా పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు. నెల్లూరు నగరంలో పగలు, రాత్రి బీట్‌లను పటిష్టం చేశారు. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులపై కొరడా ఝళిపిస్తున్నారు. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, ధాబాలు, లాడ్జీల్లో అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వేలిముద్రలను ఫింగర్‌ప్రింట్ పరికరాల ద్వారా పరిశీలించి నేరాలు జరగకుండా జాగ్రత్తలు చేపడుతున్నారు. ఆదివారం నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు సురేంద్రబాబు, టీవీ సుబ్బారావు, అన్వర్‌బాషా, సీతారామయ్య, నరసింహారావు, రాములునాయక్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తెలుగుగంగ కాలనీ, రామకోటయ్య నగర్, శ్రామిక నగర్ తదితర ప్రాంతాల్లో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం దుకాణాల బయట, పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాపుల వద్ద మద్యం తాగుతున్న వారిని మందలించారు. కూల్‌డ్రింక్ షాపుల వద్ద మద్యం తాగేందుకు అనుమతిస్తే కేసులు నమోదు చేస్తామని నిర్వాహకులను హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు లేని వాహనాలపై జరిమానాలు విధించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తమ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని నగర పోలీసు అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అదనపుకట్నం కోసం వేధింపులు

- వివాహిత ఫిర్యాదుతో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): అదనపుకట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేయడమే కాకుండా పుట్టింటికి పంపేసిన భర్త, అత్తింటి వారిపై దిశ పోలీసులు ఆదివారం వేధింపుల కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో విదీష్, విదీరా దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి 2016లో వివాహమైంది. ఒక బాబు ఉన్నాడు. వివాహ సమయంలో విదీష్‌కు రూ.5 లక్షల నగదు, 20 సవర్ల బంగారు ఆభరణాలు, ఇంటి స్థలం కట్నంగా వచ్చింది. కొంతకాలం కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త, అత్తింటివారు ఆమెను అదనపు కట్నం కోసం వేధించసాగారు. ఇటీవల ఆమెను ఇంట్లోంచి పుట్టింటికి పంపేశారు. వారి చేష్టలతో విసిగిపోయిన విదీరా దిశ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చినా తీరు మారలేదు. దిశ ఎస్సై కె.శేఖర్‌బాబు బాధితురాలి భర్త, అత్తింటివారిపై వేధింపుల కేసు నమోదు చేశారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



బాలుర జట్టుతో అసోసియేషన్ సభ్యులు, పీడీలు



బాలికల జట్టు

కందుకూరు రూరల్: ఏపీ సీఎం కప్‌కు సంబంధించి ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగాయి. ఎంపికైన జట్లు త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని అసోసియేషన్ సెక్రటరీ టి.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ కంచర్ల రామయ్య, అసోసియేషన్ సభ్యుడు సయ్యద్ జిలానీ, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసరావు, పొన్నలూరు పీడీ చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు : సీహెచ్ హేమంత్, జి.హరికృష్ణ, ఎం.సందీప్, టి.మోహన్‌చంద్, కె.వెంకటేష్, టి.విష్ణువర్ధన్, జె.జోషఫ్, కె.ఏసుబాబు (కందుకూరు టీఆర్‌ఆర్ కళాశాల), ఆర్.గణేష్, డి.హేమంత్, పి.పవన్‌కుమార్‌రెడ్డి (దర్శి), జి.మన్మథరావు (పొన్నలూరు).

బాలికల జట్టు : కె.అశ్విని, పి.సుష్మ గాయత్రి, కౌసల్య, పి.శాంతి, డి.హరిత, కె.స్రవంతి, ఎం.కల్పన(టీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల), సీహెచ్ వైష్ణవి, డి.యామిని (పొన్నలూరు), కె.చిట్టెమ్మ, కె.వర్షిణి, మంజూష (కేజీబీవీ, మొగుళ్లూరు).

రైలు ప్రయాణికులకు అవగాహన

- ఆత్మకూరు బస్టాండ్ రైల్వే బ్రిడ్జి వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- సిబ్బంది నియామకం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు



రైల్వే ప్లాట్‌ఫాం చివరన ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ రైల్వే బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది రైలు ఢీకొని మృత్యువాత పడుతున్నారు. ప్రమాదాలను నివారించేందుకు రైల్వే పోలీసులు చర్యలు చేపట్టారు. ఆదివారం రైల్వే బ్రిడ్జి వద్ద, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. బ్రిడ్జి వద్ద రాకపోకలను అడ్డుకునేందుకు రైల్వే పోలీసు సిబ్బందిని నియమించారు. ప్రయాణికుల రాకపోకలకు వీలు లేకుండా పట్టాల పక్కన గోడను నిర్మించాలని ఈ సందర్భంగా నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్‌ను కోరారు.

అలా చేయొద్దు

ప్రయాణికులను చైతన్యవంతులను చేసేందుకు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.వసంతరావు, నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఆదివారం ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కదిలే రైలు నుంచి దిగడం, ఎక్కడం, ఫుట్‌పాత్ ప్రయాణం ప్రమాదమన్నారు. ఫుట్‌పాత్‌ల నుంచి కాకుండా పట్టాల మీదుగా ప్లాట్‌ఫాంలకు వెళ్లడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, హెడ్‌ఫోన్స్‌లో పాటలు వింటూ పట్టాలను దాటొద్దన్నారు. మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండకుండా పట్టాలపై రాకపోకలు సాగించడం ప్రమాదాలకు కారణాలన్నారు. ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు వెళ్లేవారు విధిగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేదా ఎస్కలేటర్‌ను వినియోగించుకోవాలన్నారు. ఫుట్‌పాత్ లేని వంతెనల మీదుగా రాకపోకలు సాగించడం మృత్యువుకు ఎదురెళ్లడమేనన్న విషయాన్ని గుర్తుంచుకుని వాటిని విరమించుకోవాలన్నారు. ఆత్మకూరు బస్టాండ్ రైల్వే బ్రిడ్జిపై నడిచే ప్రయాణికులపై ఇండియన్ రైల్వే యాక్ట్ సెక్షన్ 147 ప్రకారం రూ.1,000 అపరాధరుసుం లేదా ఆరునెలల జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు.